క్లుప్తంగా

వరి సోనామసూరి రూ.2,256

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం వరి సోనామసూరి క్వింటా ధర గరిష్టంగా రూ.2,256, కనిష్టంగా రూ.1,430 పలికింది. హంస గరిష్టంగా రూ.1,629, కనిష్టంగా రూ.1,325 , జొన్నలు గరిష్ట, కనిష్టంగా రూ.4,609, పెసలు గరిష్టంగా రూ.8,102, కనిష్టంగా రూ.7,728, ఆముదాలు గరిష్టంగా రూ.5,279, కనిష్టంగా రూ.5,269, శనగలు గరిష్టంగా రూ.4,840, కనిష్టంగా రూ.4,789 పలికింది. పత్తి క్వింటా గరిష్టంగా రూ.7,600, కనిష్టంగా రూ.4,500 పలికింది.

హైదరాబాద్ తరలిన నాయకులు

ధన్వాడ: హైదాబాద్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ యువ సంఘర్షణ సభకు సోమవారం ధన్వాడ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తుందని పట్టణ అ. ధ్యక్షుడు నరేందగౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రఘువేందర్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, మైబుబ్‌ఖాన్, యూసుఫ్, ఖదీర్‌పాషా ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులకు బుద్ధి ప్రసాదించాలి

నారాయణపేట టౌన్: కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికల సందర్భంగా భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని ప్రకటించడంపై మంగళవారం ప్రధాన హనుమాన్ ఆలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింలు, ప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ బుద్ధి, జ్ఞానం ప్రసాదించాలని హనుమాన్ చాలీసా పారాయణం భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, హిందూ సంస్థ నిర్వాహకులు చేపట్టి విజయవంతం చేయాలని కోరారు.

గోదాంలు నిర్మించాలి

మరికల్: వరి పండించిన రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మండలంలోని ఎలిగండ్ల వద్ద ఎంపిక చేసిన స్థలంలో ధాన్యం నిల్వల కోసం గోదాంలు నిర్మించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేణు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానికంగా ధాన్యం నిల్వ చేసేందుకు గోదాంలు లేక ధన్వాడ గోదాంలకు ధాన్యం తరలించడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అలాగే ధాన్యం తీసుకెళ్లిన రైతుల నుంచి మిల్లర్లు 5 కేజీల చొప్పున తరుగు తీసేయడం పద్ధతి కాదని మండిపడ్డారు. ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు

మాగనూర్: మండల కేంద్రంలో గృహ, వాణిజ్య, వ్యాపార, సాధారణ విద్యుత్ వినియోగదారుల సర్వీస్‌లను సోమవారం అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టారు. విద్యుత్ చౌర్యం, అక్రమంగా విద్యుత్ వినియోగం, అధికలోడు, గృహ అవసరాల పేరుతో వ్యాపారాలకు విద్యుత్ వినియోగించం వంటి వాటిని తనిఖీలు నిర్వహించారు.

మళ్లీ తగ్గుతున్న పత్తి ధరలు

మరికల్: ఎక్కువ ధర కోసం వేచి చూస్తున్న పత్తి రైతులకు మళ్లీ నిరాశే మిగిలింది. గత నెలలో క్వింటాల్ పత్తికి రూ. 8,200 ఉండగా ఈ నెలలో రూ.7,800 పడిపోయింది. ఇంకా పత్తి ధర మరింత తగ్గే అవకాశం ఉండటంతో ఇళ్ల వద్ద నిల్వ ఉంచిన పతిని ఎంతో కొంత ధరకు రైతులు విక్రయిస్తున్నారు. మరో నెల రోజుల్లో వానాకాలం పంట సాగు సమయం రావడంతో పెట్టుబడుల కోసం నిల్వ చేసిన పత్తిని తక్కువ ధరలకే అమ్మేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ధరల కోసం వెచ్చి చూసిన రైతులు చివరకు నష్టాలతోనే అమ్ముకోవాల్సిన పరిస్థితి రావడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నర్వ: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ చెన్నయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. గ్రామస్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మక్తల్: మండలంలోని గుడిగండ్లలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామ శివారులో ఎద్దు గడ్డి మేస్తుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగలడంతో విద్యాదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత రైతు వెంకటప్పను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

- పర్యవేక్షించిన ఆర్‌అండ్‌బీ డీఈ రాములు
- వారం రోజుల్లో బీటీ నిర్మాణం పూర్తి



స్థానికులతో మాట్లాడుతున్న డీఈ రాములు

దామరగిద్ద: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం నుంచి సంజీవరాయ ఆలయం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏడేళ్ల క్రితం దామరగిద్ద నుంచి యానగుంది వరకు 11.5 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్ల నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో భాగంగా గ్రామంలో పెండింగ్‌లో ఉన్న 700 మీటర్ల రోడ్డు పనులు చేపట్టారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల చొరవతో పనులు ముమ్మరం చేశారు. సోమవారం డీఈ రాములు రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. 7 మీటర్ల వెడల్పు రోడ్డు పనుల్లో జీఎస్‌బీ 200 ఎంఎం మెటల్ పనులు చేపట్టామని, డబ్ల్యూఎంఎం 250 ఎంఎం మెటల్ లేయర్ పూర్తి చేసి 40 ఎంఎం బీటీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో బీటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ ఈశ్వరమ్మ శరణప్ప, సర్పంచ్ ఆశమ్మ, వార్డు మెంబర్లు ఉన్నారు.

తాగు, సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న జలసాధన కమిటీ నాయకులు

ఊట్కూరు: ప్రభుత్వం 69 జీఓను అమలు చేసి నారాయణపేట డివిజన్‌కు తాగు, సాగునీరు అందించాలని జల సాధన కమిటీ జిల్లా కో కన్వీనర్ హెచ్ నర్సింహ కోరారు. సోమవారం మండలంలోని బిజ్వార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వార నీరందిస్తామని హామీలు ఇచ్చి కాలయాపన చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా స్థానికులు వలసలు వెళ్తున్నారని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లాకు సాగునీరు అందించేందుకు 69 జీఓ అమలుచేస్తే శాశ్వతమైన పరిష్కారం లభిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి పేట జిల్లాకు నీరందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులు కురుమప్ప, రాఘవేందర్, రాజమౌలి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి అందించాలి



నర్వ డిప్యుటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డీఎస్పీ నాయకులు



ఊట్కూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నర్వ: భారత రాజ్యాంగం గ్రంథాన్ని ప్రతి ఒక్కరికి ఉచితంగా పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల ప్రచార కమిటీ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం డీఎస్పీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ కాళప్పకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లా కలెక్టర్లలకు ఈ నెల 2న, విజ్ఞాపన పత్రాలను అందించామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల ప్రచార కమిటీ సభ్యులు అరుణ్, కృష్ణ, మన్యం, భీమేష్, రాజు, వెంకటేష్, నరేష్, రాజు, కథలప్ప, ప్రవీణ్, కురుమూర్తి, మహేష్, తదితరులున్నారు.

ఊట్కూరు: బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరికి పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ కోఆర్డినేటర్ దశరథ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారి తిరుపతయ్యకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, వేణుమహారాజు, కృష్ణమహారాజు, నవీన్‌మహారాజు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని డీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం అందజేశారు. అందరికి రాజ్యాంగం అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ప్రచార కమిటీ సభ్యులు ఓబ్లేష్, సూర్యకళ, తాయప్ప, లింగప్ప, నర్సిములు, నాగేస్, అనిల్, కురుమయ్య, తిమ్మరాజ్, జరీనాబేగం పద్యరాణి పాల్గొన్నారు.

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న ప్రజాప్రతినిధులు

కృష్ణా: అర్హులైన గొల్ల కురుమ యాదవులకు త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ పూర్ణిమపాటేల్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలు గ్రామాల్లో నెల కొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్‌లు సభలో మొరపెట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్నా రైతు బీమా ఆదర్శంగా నిలిచిందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఈశ్వరప్పగౌడ, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వైపి రమేష్, ఏపీఓ యాదవరాజ్, ఏఓ సుదర్శన్‌గౌడ్, ఐసీడీఎస్,పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ పాటేల్, పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



జిల్లా పౌరసరఫరా శాఖ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న బీకేఎస్ నాయకులు

నారాయణపేట టౌన్: జిల్లాలో అకాల వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు నష్టపోయారని, తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీకేఎస్ జిల్లా కార్యదర్శులు అనంతరెడ్డి, గోపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా పౌరసరఫరా శాఖ కార్యాలయంలో డీఎం హతీరామ్‌కు బీకేఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతం వస్తేనే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ప్రతి వరి గింజను రైతుల ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎస్ సహా కార్యదర్శి ప్రభు మిస్కిన్. రమేష్, చంద్రు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిలే దీక్షలు



సమావేశమైన మండల సాధన సమితి నాయకులు

నారాయణపేట రూరల్: అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండల కేంద్రంగా చేయాలని మండల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నుంచి చేపడుతున్న రిలే దీక్షలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అన్ని పార్టీల నాయకులతో కలిసి జేఏసీగా ఏర్పడ్డామని, అంతా కలిసి సమష్టిగా పోరాటం చేసి మండలం సాధించుకుందామని పిలుపునిచ్చారు. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలంగా ప్రకటించడంలో ప్రభుత్వానికి ఇబ్బందులు ఎందుకని ప్రశ్నించారు. ఏన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న పాలకులు స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సరియైన స్థలం ఉందని, తాత్కాలికంగా భవనాలకు కొరత లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కెంచె శ్రీనివాసులు, వెంకట్రాములు, నర్సింహులు, ఇస్మాయిల్, హజిమలాంగ్, చెన్నప్ప, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

వంటావార్పుతో జేపీఎస్‌ల నిరసన

మద్దూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెలో జేపీఎస్‌లు సోమవారం వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు బీజేపీ మండల నాయకులు మద్దతు ప్రకటించారు. గ్రామాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న కార్యదర్శులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కోస్గి, మద్దూరు జేపీఎస్, ఓపీఎస్ పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్, మదన్, సాయిలు, రవికుమార్, రాజశేఖర్, భరత్, కన్కప్ప, నరహరిచారీ, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు

కోస్గి: కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొని ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ కోటకొండ రాము ఆధ్వర్యంలో పలువురు నాయకులు కర్ణాటక రాష్ట్రం సేడం నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్, నాయకులు రమేష్, మహేందర్, పలువురు పాల్గొన్నారు.

క్రీడలకు పేర్లు నమోదు చేసుకోవాలి

ధన్వాడ: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న సీఎం కప్ 2023 పోటీలకు తమ పేర్లు, గ్రూప్‌ల పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సద్గుణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీలోపు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ కోసం 15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సున్న క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అన్ని వివరాలకు నంబర్ 80963 17631, 98854 65268లకు ఫోన్‌లో గానీ లేదా మండల పరిషత్ కార్యాలయంలో కానీ సంప్రదించవలిసిందిగా కోరారు.

అందుబాటులో వరి విత్తనాలు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామ పంచాయతీ టై రోడ్డు రైతు ఆగ్రోసేవ కేంద్రంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీటీ 5204 రకం 25 కేజీలకు గాను రూ.887.50లు, ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం 25 కేజీలకు రూ.912.50లకు విక్రయిస్తునట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెక్షన్ ఇన్‌చార్జ్ పాత్ర కీలకమైంది

నారాయణపేట రూరల్: పీఎస్‌లో సెక్షన్ ఇన్‌చార్జ్ పాత్ర కీలకమైందని వర్టికల్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని అన్ని పీఎస్‌లలో సెక్షన్ ఇన్‌చార్జ్‌లతో మరికల్ పీఎస్ నుంచి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, కేసుల విషయంలో టెక్నికల్ విషయాలను పరిశీలించాలని అన్నారు. పీఎస్‌కు వచ్చిన ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రాధాన్యతను బట్టి పీఎస్‌లో జరిగే ప్రతి విషయాన్ని ఎస్‌హెచ్‌ఓ దృష్టికి తీసుకురావాలన్నారు. డయల్ 100కు వచ్చే ప్రతి ఫిర్యాదును అటెండ్ చేయాలని అన్నారు.

పనికి తగ్గ వేతనం చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

నారాయణపేట టౌన్: సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపల్ పార్కు ఎదుట తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం మాట్లాడుతూ 15ఏళ్లుగా పనిచేస్తున్నా సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయడం లేదన్నారు. వైద్య రంగంలో ఆయువు పట్టుగా ఉన్నా ఏఎన్‌ఎంలను వెట్టి చాకిరి చేయించడం అన్యామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం యూనియన్ నాయకులు రాజేశ్వరి, సావిత్రమ్మ, అనురాధ, రాజేశ్వరి, అరుణ, చంద్రకళ, వెంకటమ్మ, గిరిజ పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై దృష్టిపెట్టాలి



బార్డర్ చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

నారాయణపేట రూరల్: కర్ణాటకలో పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో తెలంగాణ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా ఎలాంటి డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీగా వాహనాల తనిఖీలు చేపట్టాలని అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం వివిధ చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడుతూ కీలక సమయం ఆసన్నమైందని, ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణంగా పరిశీలించిన తర్వాతనే వదిలి పెట్టాలన్నారు. నగదు, మద్యం, వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు వాహనాల్లో వెళ్తుంటే పూర్తి విచారణ చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన బార్డర్ చెక్‌పోస్టుల్లో సోమవారం వాహనాల తనిఖీ ముమ్మరంగా కొనసాగింది.

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని చెక్‌పోస్టును అదనపు ఎస్పీ నాగేంద్రుడు సోమవారం తనిఖీ చేశారు. వాహనాలను తనిఖీ చేయాలని, నంబర్లు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. మక్తల్ సీఐ సీతయ్య, కృష్ణా ఎస్ఐ విజయభాస్కర్ తమ సిబ్బందితో కృష్ణా రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు.

కార్యదర్శుల జీవితాలతో ఆడుకోవద్దు



మాట్లాడుతున్న సత్యాయాదవ్

నారాయణపేట రూరల్: రెగ్యులర్ చేయాలంటూ రోడ్డుమీదికి వచ్చిన పంచాయతీ కార్యదర్శుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యయాదవ్, పీవైఎల్ జిల్లా సహ కార్యదర్శి సలీం విమర్శించారు. జేపీఎస్, ఓపీఎస్‌లు ధర్నా 1వ రోజు కొనసాగించారు. నియోజకవర్గంలోని అన్ని జీపీల కార్యదర్శులు జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. చీపుర్లతో రోడ్లు శుభ్రం చేస్తూ నిరసన వ్యక్తంచేశారు. దీనికి బీజేపీ, బీజైవైఎం, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, పీవైఎల్, పీఓడబ్ల్యూ, సర్పంచ్‌ల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అశోక్, కెంచె శ్రీనివాస్, ప్రభాకరవర్ధన్; శ్రీనివాస్, రమేష్, చిన్నరఘు, చెన్నప్పయాదవ్, విజయలక్ష్మి, కోట్ల జగన్మోహన్‌రెడ్డి, ప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, శివకుమార్, నవిత, జ్యోతి, బబిత, సౌందర్య, అంజి, జ్ఞానేశ్వరీ, ఖాదీర్, రవిందర్‌నాయక్ పాల్గొన్నారు.

10న అథ్లెటిక్ సెలక్షన్ ట్రయల్

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఈనెల 10నుంచి అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్ ఉంటుందని ఆ సంఘం నాయకులు రమణ, అంబరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26వ తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నారాయణపేట జిల్లా జట్టును ఎంపిక చేస్తామని, ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి 18ఏళ్లు పూర్తయ్యే వారు అర్హులని, ఆధార్‌కార్డుతో బుధవారం ఉదయం 9గంటలలోపు వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. పరుగుపందెం, లాంగ్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిసకస్ త్రోకు సంబంధించి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

దళితుల భూములకు పాస్ బుక్కులు ఇవ్వాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోస్గి: తరాలుగా సాగు చేసుకుంటున్న దళితుల భూములకు అధికారులు పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బాధిత రైతులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని చెన్నారంలో వంద సంవత్సరాలకు పైబడి దళిత కుటుంబాలు 7.12 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారని, ధరణి వచ్చిన తర్వాత ఈ భూములను కొందరు అధికారులు, రియల్టర్లతో కలిసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో తరాలుగా సాగు చేసుకుంటున్న దళిత కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ విషయంలో అధికారులు సమగ్ర విచారణ జరిపి పేదలైన దళిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ మమతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, బాధిత రైతులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ఊరేగింపు



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

మక్తల్: మండలంలోని మాద్వార్‌లో సోమవారం వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బ్రహ్మయ్య మాట్లాడుతూ ఈ నెల 9న యజ్ఞం, 10 స్వామి వారికి ప్రత్యేక పూజలు, 11న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందన్నారు. గట్టు తిమ్మప్ప దేవాలయ ఆవరణలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని రూ.25 లక్షలతో నిర్మించామన్నారు. భజన పాటతో, నృత్యాలు చేస్తు ఊరేగింపుతో వెళ్లారు. కార్యక్రమంలో మార్కెయార్డు డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ ఇందిర, బాల్‌రాజ్, సత్యనారాయణ , వెంకటేష్ , నరేస్, రవికుమార్, అంజనేయులు, కృష్ణయ్య, విశ్వనాత్, శంకర్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యంనోనిపల్లి సర్పంచ్ భారతి అన్నారు. సోమవారం మండలంలోని యంనోనిపల్లి పంచాయతీ కార్యాలయంలో కంటివెలుగు శిబిరం ఆమె ప్రారంభించారు. గ్రామస్తులందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, సచిన్, వరలక్ష్మి, సులోచన, లక్ష్మి, లావణ్య, శ్రీనమ్మ, మల్లేష్, రాజేశ్వరి, బలప్ప, శివకుమార్ కూర్మయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ సూచించారు. పట్టణంలోని 5వ వార్డు ప్రభుత్వ మార్కెట్ లైన్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు కేంద్రంలో వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులోని ఇంటింటికీ వెళ్లి ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికి వరకు కళ్ల అద్దాలు అందించిన వారి వివరాలు వైద్య సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. కంటి ఆపరేషన్ ఉన్నవారిని గుర్తించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. 18ఏళ్ల పైబడ్డ వారికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మోనేష్‌చారి, బీఆర్ఎస్ నాయకులు గందె చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండంలోని నేరడగంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరానికి విశేష స్పందన లభిస్తుందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం శిబిరాన్ని సిబ్బంది, వైద్యులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి వ్యక్తికి కంప్యూటరైజ్డ్ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ కంటి వెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊట్కూరు: మండలంలోని పగిడిమారిలో సోమవారం ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏండ్ల పైబడినవారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఉచితం అద్దాలతో పాటు ఆపరేషన్ చేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, సర్పంచ్ సులోచనమ్మ, వైద్యాధికారులు డా భవాని, వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, జనార్దన్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.